సాక్షి అనంతపురం

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.21,200

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,200 పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.7. సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/12.8°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పంచాయతీరాజ్ సమస్యలపై నేడు 'ఫోన్‌ఇన్'



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పంచాయతీరాజ్ సమస్యలపై కలెక్టర్ వి.వినోద్‌కుమార్ గురువారం ఆకాశవాణి కేంద్రం నుంచి 'అనంత మిత్ర ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7.45 నుంచి ఉదయం 8.15 గంటల వరకు ప్రజల నుంచి కలెక్టర్ నేరుగా ఫోన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తారు. సమస్యలను 08554-225533, 296890 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు.

నేటి నుంచి సునామ జకినీమాత ఉత్సవాలు



సునామ జకినీ మాత ఆలయం

గుత్తి: స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులో వెలసిన ఆరె కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. దేశంలోనే ఏకైక సునామ జకినీ మాత ఆలయం కావడంతో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ఆరె కటికలు పెద్ద ఎత్తున ఉత్సవాలకు హాజరు కానున్నారు. ఈ క్రమంలో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, విశేష అలంకరణ, పూసలు చేయనున్నారు. మహా మంగళహారతి అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగింపు చేయనున్నారు. 7న సామూహిక కుంకుమార్చన, అయ్యప్ప దేవాలయంలో సునామ జకినీ మాతకు గంగాస్నానం, పాల కుంభాలతో ఊరేగింపు, అతిథుల ప్రసంగాలు, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆరె కటిక విద్యార్థులకు బహుమతుల ప్రదానం, అన్నదానం ఉంటాయి.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

రాజంపేట: వైఎస్సార్ జిల్లా రాజంపేట మండలం కొత్త బోయినపల్లెలోని ఓ హాస్టల్‌లో బుధవారం ఇంజినీరింగ్ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అఖిల (23) అనే విద్యార్థిని అన్నమాచార్య యూనివర్సిటీలో సీఎస్‌ఈ నాలుగో సంవత్సరం చదువుతోంది. ఆమెది పెద్దపప్పూరు మండలంలోని సి. చిక్కేపల్లి అని తోటి విద్యార్థులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు మన్నూరు సీఐ అలీ తెలిపారు.

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నారుల వార్డులో అధ్వాన స్థితికి చేరుకున్న పడకలివీ. ఐసీయూలో 20 పడకలు ఉంటే 16 పాడైపోయాయి. ఏ సమయంలో అవి విరిగి పడతాయోననే భయం తల్లులను వెంటాడుతోంది. ఇక.. చిన్నారుల ఐసీయూలోని 12 ఏసీలు కూడా సరిగా పని చేయడం లేదు. ఇటీవల మరమ్మతు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.



చిన్నారులపై చిన్నచూపు

- సర్వజనాస్పత్రి చిన్నపిల్లల వార్డులో సౌకర్యాలు మృగ్యం
- మందుల కొరతతో తల్లిదండ్రుల అవస్థలు
- పాడైపోయిన పడకలతో ఇక్కట్లు
- పని చేయని ఏసీలతో ఉక్కిరిబిక్కిరి
- సౌకర్యాల కల్పనపై దృష్టి సారించని ప్రభుత్వం



సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో వివిధ రకాల మందుల కొరత ఉన్నట్లు పేపర్‌లో రాసి ఉంచిన దృశ్యమిది. ఇవే కాదు.. సిరంజీలు, దూది, హైడ్రోజన్ పెరాక్సైడ్, నెబులైజేషన్లు లేవు. జ్వరం, ఫిట్స్, గుండె తదితర సమస్యలతో బాధపడే చిన్నారులకు అందించే డోపమైన్, డోబుటమిన్, డాక్సీసైక్లిన్, ఎంవీఐ, లివిపిల్, సెఫ్టాడిజైమ్, ఐవీఐజీ, ఇంజెక్షన్లు, డెసిరాక్స్, ల్యూమిరాక్స్, ఫ్రీజియమ్ టాబ్లెట్లు, ఒసాల్టమిర్, అజిత్రాల్, ఎల్‌సీడీ ట్యూబ్స్, పీసీటీ ఇన్ఫ్యూషన్స్ తదితరాలు కూడా అందుబాటులో లేవు. దీంతో ఆయా మందులు, పరికరాలను రూ. వేలు వెచ్చించి ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

అనంతపురం మెడికల్: ఉమ్మడిల్లా ప్రజలకు పెద్దదిక్కైన అనంతపురం సర్వజనాస్పత్రిలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వ అలసత్వంతో మౌలిక సదుపాయాలు మృగ్యంగా మారాయి. దీంతో పేదలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సరైన సౌకర్యాలు లేక చిన్నపిల్లల వార్డులో బాధితుల ఇబ్బందులను గమనిస్తే అయ్యో అనక తప్పదు. ఇక్కడ చిన్నారులకు అత్యవసరమైన 20 రకాలకు పైగా మందులు అందుబాటులో లేవు. దీంతో తల్లిదండ్రులు రూ. వేలు వెచ్చించి బయట మందుల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. అర్ధరాత్రి వేళ డాక్టర్లు అత్యవసరంగా మందులు రాస్తే వాటిని తీసుకొచ్చేందుకు నరకం కనిపిస్తోంది. దీనికితోడు చిన్న పిల్లల వార్డులో ఐసీయూ పడకలు, ఏసీలు మరమ్మతుకు నోచుకోకపోవడంతో బాధలు చెప్పనలవిగా మారాయి.

ఆయారాం..గయారాం

వార్డులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, సమస్యలు పరిష్కరించాల్సిన ఆస్పత్రి అధికారులు తమ గదులకే పరిమితమైపోతున్నారు. పిచ్చాపాటీ మాట్లాడుకోవడానికే వారి సమయం సరిపోతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప మార్పు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

గత ప్రభుత్వంలో మహర్దశ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి మహర్దశ పట్టింది. మందుల నుంచి భవనాల మంజూరు వరకు అప్పటి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నాడు–నేడు కింద రూ.300 కోట్లతో ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్‌లు, హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ప్రధానంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చింది. అందుకు సంబంధించి రూ.30 కోట్లు విడుదల చేసింది. న్యూరో సర్జరీ, కార్డియో శస్త్రచికిత్సలు జరిగేలా చర్యలు చేపట్టింది. 7 సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభించి పేదలకు సాంత్వన చేకూర్చింది. ఇక మందుల కొరత లేకుండా డిమాండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు సమకూర్చింది. సర్వజనాస్పత్రిలో చిన్నపిల్లల వార్డును కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దింది. అత్యాధునిక వెంటిలేటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, ఏసీలు అందించి ఎలాంటి సమస్యలు లేకుండా చూసింది. కూటమి ప్రభుత్వం వైద్య రంగం గురించి అసలు పట్టించు కోకపోవడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది.

సర్వజనాస్పత్రి చిన్నపిల్లల వార్డులో యూనిట్లు	3
ఓపీ	300 నుంచి 400
పడకల సామర్థ్యం	90
ప్రస్తుతం అడ్మిషన్‌లో ఉన్న చిన్నారులు	95

రూ.500 ఖర్చయింది



మా బాబు చేతన్‌కుమార్‌కు ఇటీవల జ్వరం వస్తే చిన్నపిల్లల వార్డులో చేర్పించా. మందులు బయటకు రాసిస్తున్నారు. వాటి కొనుగోలుకు ఇప్పటికే రూ.500కు పైగా ఖర్చయింది. ఇంకా వివిధ రకాల మందులు తీసుకోవాల్సి ఉంది. మందులన్నీ ఇక్కడే ఇస్తే బాగుంటుంది.

– లక్ష్మి, ఆరో రోడ్డు, అనంతపురం

ఉచితం ఎక్కడ?



మా పాప హన్షికకు జ్వరం వస్తుంటే సర్వజనాస్పత్రిలో అడ్మిట్ చేశాం. పెద్దాస్పత్రిలో అన్నీ ఉచితం అంటారు.. ఇక్కడ చూస్తే మందులు లేవు. గత్యంతరం లేక బయట దుకాణాల్లో కొనుగోలు చేశాం. ఒక్క ఇంజెక్షన్‌కు రూ.500 అవుతోంది. ఇలాగైతే మాలాంటి పేదల పరిస్థితి ఏం కావాలి?

– లావణ్య, అనంతపురం

సౌకర్యాలు కల్పిస్తాం



చిన్నపిల్లల వార్డులో పడకల సమస్య ఉన్న మాట వాస్తవమే. మూడు రోజుల్లో కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. మందుల కొరత గురించి తెలియదు. ఒకసారి వార్డును పరిశీలిస్తా. మందులు అందుబాటులో ఉండేలా చూస్తా. రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వ రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రాయలసీమ జిల్లాల మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14న తిరుపతి జంక్షన్‌లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరే నంబర్ 07117 రైలు.. రెండు రోజుల తరువాత దానాపూర్ రైల్వేస్టేషన్‌కు రాత్రి 11.55 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు (07118) అక్కడి నుంచి 17వ తేదీ మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి రెండు రోజుల తరువాత తిరుపతి జంక్షన్‌కు మధ్యాహ్నం 1.45 గంటలకు చేరుతుందన్నారు. రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల్, వనపర్తిరోడ్డు, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ, మాల్కజ్‌గిరి, చర్లోపల్లి, ఖాజీపేట మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందని పేర్కొన్నారు.

- అదేవిధంగా తిరుపతి–దానాపూర్ మార్గంలో మరో ప్రత్యేక రైలు (07119) ఈ నెల 18న నడుస్తుందన్నారు. ఆ రోజు రాత్రి 11.45 గంటలకు తిరుపతి జంక్షన్ నుంచి బయలుదేరి రెండు రోజుల తరువాత దానాపూర్ రైల్వేస్టేషన్‌కు రాత్రి 11.55 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి (07120) అక్కడి నుంచి ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి రెండు రోజుల తరువాత మధ్యాహ్నం 1.45 గంటలకు తిరుపతి జంక్షన్ చేరుకుంటుందన్నారు.రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాద్గిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, చర్లోపల్లి, ఖాజీపేట మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ఈ రైళ్లకు టూటైర్, త్రీటైర్ ఏసీ, స్లీపర్ కోచ్‌లతోపాటు జనరల్ బోగీలు ఉంటాయన్నారు. సద్వినియోగం చేసుకోవాని కోరారు.

కొండమీదరాయా గోవింద..

బుక్కరాయసముద్రం: కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం వెంకటరమణ స్వామి దేవాలయంలో శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాల నడుమ దేవరకొండపైకి తీసుకెళ్లారు. గురువారం ఉదయం దేవర కొండపై హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనాథ్ స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎంపీపీ సునీత, ఈట బాబు, జెడ్పీటీసీ నీలం భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



పుర వీధుల్లో స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఏ'మార్చి'.. డబ్బు కాజేసి!

కళ్యాణదుర్గం: వృద్ధుడిని ఏమార్చి నగదు అపహరించిన ఘటన కళ్యాణదుర్గం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన తలారి ఈరన్న బుధవారం మధ్యాహ్నం గాంధీ చౌక్ సమీపంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఏటీఎం వద్దకు వెళ్లాడు. తన ఏటీఎం కార్డును అక్కడే ఉన్న ఓ వ్యక్తికి ఇచ్చి డబ్బు డ్రా చేసివ్వమని కోరాడు. ఈ క్రమంలోనే దుండగుడు తన వద్ద ఉన్న నకిలీ కార్డును ఏటీఎంలో పెట్టి డబ్బు డ్రా చేస్తున్నట్లు నటించాడు. కొంత సేపటికే డబ్బు రావడం లేదంటూ కార్డును ఈరన్నకు ఇచ్చి, బ్యాంక్ అధికారులను సంప్రదించాలని సూచించాడు. ఈ క్రమంలోనే రూ.10 వేలు డ్రా చేసుకుని ఉడాయించాడు. ఈరన్న వద్ద ఉన్న కార్డును పరిశీలించిన బ్యాంకు సిబ్బంది అది నకిలీదని తేల్చారు. రూ.10 వేలు డ్రా చేసుకున్నట్లు తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు వెంటనే కళ్యాణదుర్గం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఏటీఎంలో దుండగుడు (టీ షర్టు వేసుకున్న వ్యక్తి)

ఉద్యాన రైతుల తలరాత మారుస్తాం



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, వేదికపై కలెక్టర్ వినోద్‌కుమార్, విప్ కాలవ, ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు



కాంక్లేవ్‌కు హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు, రైతులు

- 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్' లో ఆర్థిక శాఖ మంత్రి కేశవ్

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన రైతుల తలరాతలు మార్చుతామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంవైఆర్ కన్వెన్షన్ హాలులో 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మెంటార్‌గా స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సీఈఓ గెద్దం శేఖర్‌బాబు హాజరు కాగా... ముఖ్య అతిథిగా మంత్రి పయ్యావుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధరలను స్థిరీకరించి రైతులను ఆర్థికంగా గట్టెక్కించే బాధ్యత తీసుకుంటామన్నారు. 'అనంత' బ్రాండ్‌ను క్రియేట్ చేసి ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారుస్తామన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న కాలంలో 'అనంత' ఫలసాయం బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీకే కాకుండా అంతర్జాతీయ స్థాయి మార్కెట్లకు అనుసంధానించి రైతులు ఆర్థికంగా గట్టెక్కేలా కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఐఆర్‌టీఎస్ ప్రతినిధి అనితాబారుక్‌లు తమ సందేశాలను వీడియో ద్వారా వినిపించారు.

ఏడు ఎంఓయూలు..

కాంక్లేవ్‌కు వివిధ రాష్ట్రాల నుంచి 64 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరైనట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పండ్లతోటలు, కూరగాయల పంటలు పండించే రైతులకు వివిధ రూపాల్లో ఉపయోగపడేలా ఏడు కంపెనీలతో ఎంఓయూలు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో నాలుగేళ్ల యాక్షన్ ప్లాన్ కింద ఉద్యాన తోటలను 10 వేల హెక్టార్లకు పెంచడం, సూక్ష్మసాగు కింద 25 వేల హెక్టార్లకు డ్రిప్ అందివ్వడం, 29 లక్షల మెట్రిక్ టన్నులకు దిగుబడి పెంచడం, పంట తొలగింపు తర్వాత నష్టాలను 10 శాతం తగ్గించి ఏటా రూ.800 కోట్ల మేర రైతులు లాభం పొందేలా చేయడమే కర్తవ్యమన్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సీఈఓ శేఖర్‌బాబు మాట్లాడుతూ ఉద్యాన ఉత్పత్తులకు విలువ ఆధారిత పెంపులో భాగంగా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. అనంతరం రైతులకు సేవలందించిన ఎన్‌జీఓలు, ఉత్తమ రైతులు మొత్తం 11 మందికి అవార్డులు ప్రదానం చేశారు. ఎలైట్ బయోటెక్నాలజీస్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, కార్డు సంస్థ, అవని ఫామ్స్, డిజిటల్ గ్రీన్, శ్రీక్రిష్ణ ఇంపెక్స్ సంస్థల ప్రతినిధులతో పాటు జీవీ కార్తీక్ (మామిడి రైతు), ఎం.రాజబాబు (చీనీ రైతు), పి.చంద్రనాయుడు (టమాట రైతు), కె.చౌదరి (మిరప రైతు), ఆర్.శంకరరెడ్డి (అరటి రైతు)లకు అవార్డులు అందజేశారు. అనంతరం పలు స్టాళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. శాస్త్రవేత్తలు, ఎన్‌జీఓ, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఉద్యాన రైతులు చర్చాగోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరామ్, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, బండారు శ్రావణి, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, అడిషనల్ డైరెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అవమానం



హార్టికల్చర్ కాంక్లేవ్‌కు వెళ్లకుండా ఉద్యాన రైతులను అడ్డుకుంటున్న డీఎస్పీ

అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌కు అసలు సిసలైన పండ్లతోటల రైతులను వెళ్లనివ్వకుండా అడ్డుకుని అవమానపరచడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. 'ఉద్యాన సమ్మేళనాని'కి దారి పొడవునా, ప్రధాన ద్వారం రెండు వైపులా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. గుర్తింపు కార్డు లేనిదే లోపలికి ప్రవేశం లేదని పోలీసులు తెగేసి చెప్పడంతో ఉద్యాన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో వచ్చిన తమను అవమానానికి గురి చేస్తారా అంటూ మండిపడ్డారు. రైతులు లేకుండా సమ్మేళనం ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ఇంతమాత్రానికి వారం రోజులుగా పెద్ద ఎత్తున ఎందుకు ప్రచారం చేశారని, ఎవరి ప్రయోజనాలు కాపాడేందుకని గద్దించారు. ప్రధాన ద్వారం వద్ద జరుగుతున్న గొడవ గురించి లోపల ఉన్న ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వెంటనే వారు రంగ ప్రవేశం చేసి రైతులను శాంతింపజేసి లోపలికి అనుమతించారు. రైతులు తమకు జరిగిన అవమానంపై ఆవేదన వ్యక్తం చేశారు. అయిష్టంగానే కార్యక్రమానికి హాజరయ్యారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం


రేషన్ బియ్యం డంప్

గుంతకల్లు రూరల్: స్థానిక పారిశ్రామిక వాడలోని బహిరంగ ప్రదేశంలో డంప్ చేసిన 56 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రేషన్ బియ్యాన్ని డంప్ చేసినట్లుగా స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తం చేయడంతో గుంతకల్లు రూరల్ పోలీసులతో కలసి బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టామన్నారు. 56.20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేసిన అనంతరం సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించామన్నారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని డంప్ చేసిన వ్యక్తులెవరో అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారన్నారు.

పారా లీగల్ వలంటీర్ల సేవలు అమోఘం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: న్యాయ సేవాప్రాధికార సంస్థకు, బాధితులకు వారధిగా ఉంటూ సరైన న్యాయాన్ని సరైన సమయంలో అందేలా పారా లీగల్ వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయవాదుల బార్ అసోసియేషన్ హాల్‌లో పారా లీగల్ వలంటీర్ల శిక్షణా తరగతులను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్లు నిర్వర్తించాల్సిన బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాప్రాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, న్యాయవాదులు పద్మజ, హరికృష్ణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికె నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పంపనూరులో రాతి యుగం ఆనవాళ్లు

ఆత్మకూరు మండలం పంపనూరు సమీపంలోని కొండపై రాతియుగం నాటి రేఖా చిత్రాలు వెలుగుచూశాయి. ఇక్కడి రాళ్లపై పదునైన రాతితో గీసిన తెలుపు రంగు రాతి చిత్రాలు, మూపురపు ఎద్దులు, వృత్తంతో కూడిన త్రిశూలం, వివిధ పక్షుల ఆకృతులను బళ్లారి తాలూకా సంగనకల్లుకు చెందిన చరిత్ర పరిశోధకుడు లింగన్న స్వామి తొలుత గుర్తించి వెలుగులోకి తెచ్చారు. రాతి యుగం నాటి మానవులు తమ ఐక్యతకు, జీవనానికి చిహ్నంగా వీటిని గీసినట్లుగా తెలుస్తోంది.


నాటి సంఘ జీవనాన్ని చాటిచెబుతున్న రేఖా చిత్రం



పంపనూరు కొండ రాళ్లపై చెక్కిన రాతియుగం నాటి రేఖాచిత్రాలు

- 10 వేల సంవత్సరాల క్రితం రాతి మీద చెక్కిన చిత్రాలు
- నాటి మానవుల జీవన శైలికి అద్దం పడుతున్న రేఖాచిత్రాలు

ఆత్మకూరు: చిన్నప్పుడు రాతి యుగం నాటి నాగరికత గురించి చరిత్ర పుస్తకాలలో అందరూ చదివే ఉంటారు. ఆ పుస్తకాల్లో ముద్రించిన చిత్రాలను పోలిన గుర్తులు పంపనూరు కొండపై కనిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే పురావస్తు శాఖ సమగ్ర అధ్యయనం చేపట్టింది. 10 వేల సంవత్సరాల క్రితం రాతి యుగంలో ప్రజల జీవన శైలి ఎలా ఉంటుందో ఇక్కడి చిత్రాలను చూస్తే ఊహించుకోవచ్చు. కొండపైకి ఎందరో వెళ్లి వస్తున్నా... ఏనాడు రాతి యుగం నాటి రేఖా చిత్రాలను గుర్తించలేకపోయారు. ఈ కొండపై భారీ పరిమాణంలో ఉన్న రాళ్లపై దాదాపు 600కు పైగా చిత్ర లేఖనాలు ఉన్నాయి. నాటి మానవులు వేటాడే విధానం, వారి జీవన శైలికి సంబంధించిన చిత్రాలు 10 సెంటీ మీటర్ల ఎత్తు వరకూ చూడచక్కగా ఉన్నాయి. ప్రత్యేకంగా జంతువులను వేటాడటం, పక్షులు, చేతి వేలిముద్రలు, ఆయుధాల వినియోగం, వేట అనంతరం విశ్రాంతి తీసుకునే చిత్రాలు గుంపులు గుంపులుగా ఉన్నాయి.

పదునైన రాతినే కుంచెగా మార్చి

రాతిపై చిత్రాలను గీసేందుకు అప్పట్లో పదునైన రాళ్లను వినియోగించినట్లుగా తెలుస్తోంది. ఇక్కడి కొన్ని చిత్రాల్లో పశువులను మందలుగా విభజించి, వాటిని తమ ఆధీనంలోకి తీసుకునే విధానాలను భావితరాలకు వివరించినట్లుగా ఉన్నాయి. ప్రధానంగా వృషభాలను మచ్చిక చేసుకోవడం, వాటిని వ్యవసాయానికి, సరుకు రవాణాకు ఉపయోగించే విధానాలను కళ్లకు కట్టినట్లుగా గీశారు. వేల సంవత్సరాలు గడచినా రాతి యుగం నాటి చిత్రాలు నేటికీ చెక్కుచెదరక పోవడం గమనార్హం.

చరిత్రను కాపాడుకుందాం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆది మానవుల కాలం నాటినుంచి శ్రీ కృష్ణదేవరాయల కాలం నాటి వరకూ అనేక ఆనవాళ్లు ఉన్నాయి. అయితే వాటి ప్రాముఖ్యత తెలియక చాలా మంది శిలా శాసనాలను, చిత్రాలను, కట్టడాలను ధ్వంసం చేస్తున్నారు. చరిత్ర గురించి పుస్తకాల్లోనే చదివి తెలుసుకునే అవసరం లేకుండా వాటిని నేరుగా చూసే అవకాశం పంపనూరు కొండల్లో దాగి ఉండడం విశేషం. ఇక్కడ నాటి మానవులు గీసిన చిత్రాలు అబ్బుర పరుస్తున్నాయి. వీటి ప్రాముఖ్యత తెలియక నేటి తరం వాటిపై పేర్లు చెక్కడం , చిత్రాల వాస్తవికతను దెబ్బతీసేలా గీయడం లాంటి పనులు చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. పూర్వీకుల చరిత్రను భావితరాలకు చూపించే ప్రయత్నం చేద్దాం.

– రజిత, ఏడీ, పురావస్తు శాఖ

ప్రమాదంలో యువకుడి మృతి


మృతుడు అనిల్

అనంతపురం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన మాదిగ మల్లికార్జున అలియాస్ మల్లారెడ్డి కుమారుడు అనిల్ (27)కు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం భార్య గర్భిణి. అనంతపురంలోని గంగానగర్‌లో నివాసముంటున్న అనిల్... బళ్లారి బైపాస్‌లో ఉన్న ఓ పెయింట్స్ షాపులో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 2న ఉరవకొండకు పెయింట్స్ చేర్చి వచ్చిన అనిల్... వాహనాన్ని దుకాణం వద్ద పార్కింగ్ చేసి, అక్కడున్న తన ద్విచక్ర వాహనం తీసుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో తపోవనం సర్కిల్ వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా పడుకుని ఉన్న ఆవును ఆలస్యంగా గమనించి తప్పించే క్రమంలో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనం స్కిడ్ అయి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడున్న వారు వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక మంగళవారం రాత్రి అనిల్ మృతి చెందాడు. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్యశ్రీ పేరుతో టోకరా!

- మహిళకు సైబర్ నేరగాళ్ల వల
- లింక్ పంపి విడతల వారీగా రూ.లక్షకుపైగా స్వాహా

చెన్నేకొత్తపల్లి: ఆరోగ్యశ్రీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ మహిళను నమ్మించిన సైబర్ నేరగాడు విడతల వారీగా ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్షకు పైగా నగదు మాయం చేశాడు. ఈ ఘటన చెన్నేకొత్తపల్లిలో బుధవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే..

చెన్నేకొత్తపల్లి మండలం ఓబులంపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి కుమార్తె త్రిలోకపావనికి ఈనెల 2వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో ఓ కొత్త నంబర్ నుంచి కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేయగానే అవతలి వైపు నుంచి తాను ఆరోగ్యశ్రీ కాల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నానని అపరిచితుడు పరిచయం చేసుకున్నాడు. అనంతరం రెండేళ్ల క్రితం మీ తండ్రి శస్త్ర చికిత్స చేయించుకున్నాడని, అందుకు సంబంధించి ప్రభుత్వం రూ.40 వేలు మంజూరు చేసిందని తెలిపాడు. అయితే బ్యాంకు ఖాతా సమస్య కారణంగా ఆ మొత్తం ఖాతాలో జమ చేయడం కుదరడం లేదని నమ్మబలికాడు. ప్రస్తుతం తాను ఖాతాను సవరిస్తున్నానని, ఇందుకోసం మీకు ఒక లింక్ పంపుతానని, దాన్ని ఓపెన్ చేయాలని సూచించాడు. అపరిచితుడి మాటలు నమ్మిన త్రిలోకపావని తన సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్‌చేసింది. పిన్ ఎంటర్ చేయాలని సూచించగా, ఆ మేరకు పిన్ ఎంటర్ చేసింది. దీంతో వెంటనే ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.47 వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన త్రిలోకపావని ఇదే విషయాన్ని అపరిచితుడికి తెలపడంతో ఆన్‌లైన్ సమస్య వల్ల అలా జరిగిందని, తాజాగా మరోసారి లింక్ పంపుతానని... దాన్ని ఓపెన్ చేస్తే ఇప్పటికే కట్ అయిన మొత్తంతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 వేలు కలిపి రూ.87 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని నమ్మబలికాడు. దీంతో త్రిలోకపావని మరోసారి తన సెల్‌కు పంపిన లింక్ ఓపెన్ చేసి ఓటీపీ ఎంటర్ చేయగానే ఖాతాలోని మరో రూ.40 వేలు విత్‌డ్రా అయింది. ఇలా మరోసారి చేయగా ఖాతాలో మిగిలి ఉన్న రూ.17,700 విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. ఆ తర్వాత ఫోన్ కాల్ కట్ కాగా, మెసేజ్‌లు చదువుకున్న త్రిలోకపావని తనకు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని భావించి ఆమె వెంటనే 1903 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. 1903 కాల్ సెంటర్ నుంచి ఫిర్యాదు ఎస్పీ కార్యాలయానికి రాగా, పోలీసులు త్రిలోకపావనికి ఫోన్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఆమె మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. అపరిచిత వ్యక్తులు లింక్‌లు నొక్కమని చెప్పినా, ఓటీపీ అడిగినా చెప్పవద్దని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు.

జిల్లాలో ఘరానా దొంగ కదలికలు

- గుర్తిస్తే ఆచూకీ తెలపాలన్న తాడిపత్రి పోలీసులు


ఇల్లూరి నాగేంద్ర


తాడిపత్రి అర్బన్: జిల్లాలో ఘరానా దొంగ కదలికలను తాడిపత్రి పోలీసులు గుర్తించారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలంటూ బుధవారం రూరల్ పీఎస్ సీఐ శివగంగాధరరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలు... ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు ఇల్లూరి నాగేంద్ర అలియాస్ ఉపేంద్ర ఉరఫ్ పుల్ల బొచ్చు. వైఎస్సార్ జిల్లాలోని మూడు ప్రాంతాల్లో కొద్ది రోజులుగా ఒంటరిగా వెళుతున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడి చేసి నగదు, బంగారం, సెల్‌ఫోన్లను అపహరించాడు. అక్కడి పోలీసుల గాలింపు తీవ్రం కావడంతో తాడిపత్రి ప్రాంతానికి చేరుకున్నట్లుగా వైఎస్సార్ జిల్లా పోలీసులు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన స్థానిక పోలీసులు నిఘా పటిష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడమే కాకుండా నిందితుడు నాగేంద్ర కనిపిస్తే వెంటనే 94407 96863కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

17 నుంచి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ


వివరాలు వెల్లడిస్తున్న ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి

అనంతపురం: దివంగత జర్నలిస్ట్ తేజ ప్రసాద్ స్మారకంగా జర్నలిస్టు క్రికెట్ టోర్నీ ఈ నెల 17 నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్, ప్రెస్‌క్లబ్ కమిటీ, ఏపీ జర్నలిస్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరుసగా నాలుగు రోజుల పాటు మ్యాచ్‌లు ఉంటాయన్నారు. నిఖార్సైన జర్నలిస్టుగా మూడు దశాబ్దాల పాటు నిస్వార్థంగా సమాజానికి సేవ చేసిన తేజ ప్రసాద్ పేరు మీద ఈ టోర్నీ నిర్వహించాలని వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నిర్ణయించిందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోని వర్కింగ్ జర్నలిస్టులందరూ టోర్నీలో పాల్గొనవచ్చునన్నారు. టోర్నీలో పాల్గొనే జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌తో సంబంధం లేదన్నారు. కేవలం వర్కింగ్ జర్నలిస్ట్ అయితే చాలన్నారు. ఈ నెల 9వ తేదీ లోపు ఎంట్రీలను సుభాష్‌రోడ్డులోని అంకుశం కార్యాలయంలో అందజేయాలన్నారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆజాద్, భాస్కర్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి విజయరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి


గాయపడిన నాగభూషణ

పెద్దవడుగూరు: మండలంలోని చిట్హూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నాగభూషణంపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నరసింహారెడ్డి కట్టెతో దాడి చేశాడు. బాధితుడు తెలిపిన మేరకు... గ్రామంలో ఇటీవల టీడీపీ నేతలు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై అడ్డంగా మట్టిని వేయడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సర్పంచ్ పతక ధనలక్ష్మి భర్త నాగభూషణ జోక్యం చేసుకుని ఆ మట్టిని తొలగించాలని టీడీపీ నేతలకు సూచించాడు. దీంతో కక్ష పెంచుకున్న టీడీపీ కార్యకర్త నరసింహారెడ్డి... బుధవారం ఉదయం పొలం నుంచి ఇంటికి వెళుతున్న నాగభూషణ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా నిలబడ్డాడు. కాస్త పక్కకు జరగాలని నాగభూషణ తెలపడంతో దుర్భాషలాడుతూ అందుబాటులో ఉన్న కట్టెతో తలపై బలంగా మోదాడు. దీంతో తలకు తీవ్ర గాయమైన నాగభూషణను కుటుంబసభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

సమగ్రం.. వారిదే పెత్తనం

- సమగ్ర శిక్ష కార్యాలయంలో వారు చెప్పిందే వేదం.. వారు రాసిందే ఫైలు
- ఒక్కగానొక్క సెక్టోరియల్ ఆఫీసర్‌నూ తప్పించే కుట్ర
- అప్పుడు, ఇప్పుడు చక్రం తిప్పిన సీనియర్ అసిస్టెంట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ల హవా జోరుగా నడుస్తోంది. తాము చెప్పిందే శాసనంగా వ్యవహరిస్తూ స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ ఉత్తర్వులకు వక్రభాష్యం చెబుతున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఆరు నెలల క్రితం ఇలా...

సరిగ్గా ఆరు నెలల క్రితం కార్యాలయంలో ఒకరిని మినహాయించి మిగిలిన సెక్టోరియల్ ఆఫీసర్లందరినీ ఒకే మారు రిలీవ్ చేశారు. నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్న ఈ వ్యవహారంలో ఓ సీనియర్ అసిస్టెంట్ కీలక పాత్ర పోషించడం గమనార్హం. అప్పటికే సుదీర్ఘ కాలంగా పని చేసిన ఆయన రానున్న బదిలీల్లో తప్పనిసరిగా దూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందని గ్రహించి ఈ కుట్రకు తెరతీసినట్లుగా సమాచారం.

తాజాగా మరో తప్పటడుగు

తాజాగా మరో సీనియర్ అసిస్టెంట్ నిర్వాకం వివాదాస్పదమైంది. 2023, జనవరి 19న ఫారెన్ సర్వీస్ కింద ఏపీఓగా ప్రాజెక్టుకు వచ్చిన నారాయణస్వామిని నిబంధనలకు విరుద్ధంగా రీప్యాట్రియేషన్ చేసే కుట్రకు తెరలేపాడు. నిబంధనల ప్రకారం ఓ ఉద్యోగి మూడేళ్ల వరకు ఫారెన్ సర్వీస్ కింద పని చేయొచ్చు. సర్వీస్ పూర్తయి మాతృసంస్థకు రీప్యాట్రియేషన్ అయి ఆర్నెళ్ల తర్వాత మళ్లీ ఫారెన్ సర్వీస్ కింద రావొచ్చు. నారాయణస్వామి విషయంలోనూ ఇదే జరిగింది. గతంలో ఏపీఓగా మూడేళ్లు పని చేసి బయటకు వెళ్లిన ఆయన రెండేళ్ల తర్వాత 2023, జనవరిలో మళ్లీ ఫారెన్ సర్వీస్ కింద వచ్చారు. నిబంధనల మేరకు ఆయన ఇంకా ఏడాది వరకు కొనసాగే అవకాశముంది.

ఆయన 'లెక్కలు' ఆయనవి

ఉన్నతాధికారి నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే ఏపీఓను రీప్యాట్రియేషన్ చేయాలంటూ ఓ సీనియర్ అసిస్టెంట్ ఫైల్‌ను కదిపారు. ఐదేళ్లు పూర్తయింది కాబట్టి రీప్యాట్రియేషన్ చేయాలంటూ ఫైలు పెట్టేశారు. అయితే ఐదేళ్లు ఏకకాలంలో కాదనే విషయాన్ని తొక్కి పెట్టారు. విషయం తెలుసుకున్న నారాయణస్వామి వాస్తవాలను వివరిస్తూ తనను మూడో సంవత్సరమూ కొనసాగించాలంటూ జనవరి, 17న ఏపీసీని కలిసి విన్నవించారు. ఈ వినతిని సంబంధిత శాఖకు ఏపీసీ ఎండార్స్ చేశారు. అయితే 'లెక్కలు' వేరే ఉన్న సీనియర్ అసిస్టెంట్ నేటికీ ఫైలు తొక్కి పెట్టడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై డీఈఓ ప్రసాద్‌బాబును వివరణ కోరగా 'రీప్యాట్రియేషన్ ఫైలు పెట్టమని తాను ఎవరికీ చెప్పలేదు. వారే రాసి తీసుకొచ్చారు. జీఓ 2 ప్రకారం ఒక ఉద్యోగి గరిష్టంగా ఐదేళ్లకు మించి ఫారెన్ సర్వీస్‌లో ఉండేందుకు లేదు. కొంత కాలం తర్వాత తీసుకొవచ్చనే విషయాన్ని పరిశీలిస్తాను' అని అన్నారు.

నేడు 'అనంత'కు సమగ్రశిక్ష ఏఎస్‌పీడీ

సమగ్రశిక్ష స్టేట్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏఎస్‌పీడీ) రవీంద్రనాథరెడ్డి గురువారం జిల్లాకు రానున్నారు. వివిధ పాఠశాలలు, కేజీబీవీలు, భవిత కేంద్రాలు, ఎమ్మార్సీలను ఆయన సందర్శించనున్నారు. సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఐఈఆర్పీలు అన్ని రకాలా రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ సూచించారు.

కోళ్ల మృతిపై ఆందోళన వద్దు


కోళ్ల నుంచి నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: అంతు చిక్కని రోగంతో గోదావరి జిల్లాల్లోని పౌల్ట్రీల్లో దాదాపు 2.65 కోట్ల కోళ్లు మృతిచెందిన నేపథ్యంలో జిల్లాలోని మాంసాహార ప్రియుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో గుంతకల్లు మండలం తిమ్మాపురం సమీపంలో ఉన్న సుధాకరరెడ్డి పౌల్ట్రీ ఫారాన్ని పశు సంవర్ధక శాఖ ఉరవకొండ డీడీ డాక్టర్ జి.వెంకటేష్ పరిశీలించారు. కోళ్ల ఆరోగ్యాన్ని పరీక్షించారు. వాటి నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పౌల్ట్రీ రైతులు, మాంసాహార ప్రియులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పౌల్ట్రీఫారం పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, కోళ్లకు ఆహారం, నీరు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మరణించిన కోళ్లను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం: గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తు గడువు ఈ నెల 8వ తేదీ వరకూ పొడిగించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5న దరఖాస్తుకు గడువు ముగిసింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 8వ తేదీ వరకూ గడువు పొడిగించడం గమనార్హం. ఈ నెల 10న కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియ ద్వారా మద్యం షాపులు కేటాయిస్తారు.

'బీ-ఫార్మసీ, ఫార్మా-డి'లో నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూఏ ఓటీపీఆర్‌ఐలో బీ-ఫార్మసీ, ఫార్మా-డిలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఎ.సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు ఏపీఈఏపీసెట్ (బైపీసీ)–2024 అర్హత సాధించడంతో పాటు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు అర్హులు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. పూర్తి వివరాలు www.jntua.ac.in లో తెలుసుకోవచ్చు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్న జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాడిపత్రి రూరల్ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఏఎస్పీ రోహిత్‌కుమార్‌తో కలసి సీఐ శివగంగాధరరెడ్డి వెల్లడించారు. తాడిపత్రి రూరల్ పరిధిలోని అక్కన్నపల్లి శివారున నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తులో జోరుగా పేకాట జరుగుతోందన్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పేకాట ఆడుతున్న సర్వేశ్వరరెడ్డి, మహేష్, దస్తగిరి, వెంకట అర్జున్, దేవేంద్ర, మునిరెడ్డి, వెంకట యోగేష్, నాగరాజు, అనిల్‌కుమార్‌రెడ్డి, జయకృష్ణతో పాటు మరో 8మంది జూదరులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.3,09,390 నగదు, 8 ద్విచక్రవాహనాలు, 17 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

ఉత్సాహంగా ఉట్ల జాతర


ఉట్ల మాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

కుందుర్పిలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం సాయంత్రం ఉట్ల జాతర పోటాపోటీగా సాగింది. సాయంత్రం 5గంటలకు 15మంది యువకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడ్డారు. గంటపాటు శ్రమించి చివరకు బోయ నవీన్ ఉట్లమాను పైకి చేరుకుని విజేతగా నిలిచాడు. విజేతను అభినందిస్తూ గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు నగదు పురస్కారంతో సత్కరించారు. –కుందుర్పి

క్లుప్తంగా

కల్తీ పాలను అరికట్టాలి

అనంతపురం కార్పొరేషన్: కల్తీ పాలను అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో కల్తీ పాల వ్యవహారాన్ని విజిలెన్స్ అధికారులు బట్టబయలు చేశారన్నారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న పాల విక్రయాలపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పాల సాంద్రత పెంచేందుకు మాల్టో డగ్‌స్టిన్ అనే రసాయాన్ని వినియోగిస్తున్నట్లు తెలిసిందన్నారు. కమలానగర్‌లో వాటి విక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారన్నారు. కల్తీ పాల విక్రయదారులు, రసాయనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్ అబూసలేహా పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నరసింహులు

రాప్తాడు: ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) మండల అధ్యక్షుడిగా మండలంలోని రామినేపల్లి గ్రామానికి చెందిన ఎం.నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ సమితి జిల్లా సంఘం మహిళ నాయకురాలు స్వతంత్ర కుమారి ఆధ్వర్యంలో మండల సమితి కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మార్పీఎస్ సమితి జిల్లా సంఘం మహిళ నాయకురాలు స్వతంత్ర కుమారికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో దళితులు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పిల్లల పండుగకు విరాళం

అనంతపురం ఎడ్యుకేషన్: ఈనెల 14 నుంచి 16 వరకు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న అనంత బాలోత్సవం పిల్లల పండుగ-5కు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు విరాళం అందజేశారు. సంఘం అధ్యక్షుడు గోవిందరెడ్డి రూ.5,116, డి.అనురాధ రూ. 5వేలును బాలోత్సవ నిర్వహణ కమిటీ కార్యదర్శి వి.సావిత్రి, సభ్యుడు ఎస్‌వీవీ రమణయ్యకు బుధవారం అందజేశారు. సావిత్రి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు బాలోత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం నిర్వహణ కమిటీ సభ్యులు సరళ, పీఏస్‌హెచ్‌ఎం గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ, విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి


మృతుడి భార్య గంగమ్మతో మాట్లాడుతున్న సర్పంచ్ బండా అంజియాదవ్

రాప్తాడురూరల్: రాచానపల్లి మాజీ ఉపసర్పంచ్ పూజారి అక్కులప్ప (50) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అక్కులప్ప.. సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య గంగమ్మ, ఒక కూతురు, కుమారుడు సంతానం. గంగమ్మ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. సమాచారం అందుకున్న సర్పంచ్ బండా అంజియాదవ్ ఆస్పత్రికి వెళ్లి అక్కులప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భార్య గంగమ్మకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నగరంలోని అంబేడ్కర్ నగర్‌లో పూజలందుకుంటున్న కుంటెమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం పొంగళ్ల సమర్పణ, పుష్పాభిషేకం, అలంకార సేవలతో దర్శనం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ

ఆత్మకూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వడ్డుపల్లి, తలుపూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారం ఎంత మేరకు అందిస్తున్నారని విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బాలింతలకు, గర్భవతులకు తల్లిపాల గురించి తెలియజేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఈసీసీఈ గురించి, పిల్లలతో ఎదుగుదల, తక్కువ బరువు పిల్లలతో గ్రోత్, గురించి క్లుప్తంగా వివరించారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

రూ.10 కోట్ల స్థలంపై తమ్ముళ్ల కన్ను



నగరపాలక సంస్థ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఓపెన్ ప్లాట్‌పై ఓ ప్రజాప్రతినిధి అనుచరులు కన్నేశారు. రూ.10 కోట్లు విలువ చేసే సదరు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. బుధవారం సదరు స్థలంలో ఫెన్సింగ్ వేసేందుకు కూడా సిద్ధమయ్యారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది తమకేమీ తెలియనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అయితే ఈ విషయం బయట పొక్కడంతో హుటాహుటిన ప్లానింగ్ కార్యదర్శితో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో నగరపాలక సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు కబ్జారాయుళ్లకు వత్తాసు పలుకుతుండటంపై స్థానికులు మండిపడుతున్నారు.


శ్రీనగర్ కాలనీలో రూ.10 కోట్లు విలువ చేసే నగరపాలక సంస్థకు చెందిన స్థలం ఇదే..

- ఓ ప్రజాప్రతినిధి అనుచరుల పనేనా?
- చేష్టలుడిగి చూసిన టౌన్ ప్లానింగ్
- హడావుడిగా ప్లానింగ్ కార్యదర్శితో ఆక్రమణల తొలగింపు
- క్షేత్రస్థాయిలో పర్యటించని ఇన్‌చార్జ్ ఏసీపీ శిరీష

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అనంతపురం నగరపాలక సంస్థకు చెందిన ఆస్తులకు రక్షణ లేకుండా పోతోంది. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులు ఎత్తేయడంతో కూటమి ప్రభుత్వానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరులు ఓపెన్ స్థలంపై కన్ను వేశారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో నగరపాలక సంస్థకు చెందిన 30 సెంట్ల స్థలాన్ని కబ్జా చేయడానికి బుధవారం ఏకంగా ఫెన్సింగ్ వేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆ స్థలం విలువ రూ.10 కోట్లు. కాగా విషయం బయటకు రావడంతో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆలస్యంగా స్పందించారు. నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ ఏసీపీ శిరీష కనీసం క్షేత్రస్థాయిలో పర్యటించలేదు.

అధికారుల నిర్లక్ష్యం..

ఎక్కడైనా రూ.కోట్లు విలువ చేసే నగరపాలక సంస్థ ఆస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూడాల్సిన అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసిస్టెంట్ కలెక్టర్‌గా నగరపాలక సంస్థలో శిక్షణలో ఉన్న వినూత్న నగరపాలక సంస్థ స్థలాలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్లానింగ్ కార్యదర్శే ఫెన్సింగ్‌ను తొలగించిందట..

ఏసీపీ శిరీష మాటలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో ఫెన్సింగ్ వేస్తున్న విషయం తెలియడంతో తానే ప్లానింగ్ కార్యదర్శి హీనాను ఘటన స్థలానికి పంపి, తగు చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు సాక్షికి తెలిపారు. కాగా ప్లానింగ్ కార్యదర్శి హీన.. అక్కడి కొన్ని ఆక్రమణలు తొలగించిందంటూ ఇన్‌చార్జ్ ఏసీపీ చెప్పడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

ఆస్తులను పరిరక్షిస్తాం

నగరపాలక సంస్థకు చెందిన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించాం. ఆక్రమణలు తొలగించాలని చెప్పాం. నగరపాలక సంస్థ ఆస్తులను పరిరక్షిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి నోటీసులు జారీ చేస్తాం.

– మల్లికార్జున రెడ్డి, ఇన్‌చార్జ్ కమిషనర్

జగనన్నతో భేటీ


వైఎస్ జగన్‌తో జింకల రామాంజనేయులు

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ గ్రామానికి చెందిన జింకల రామాంజనేయులు బుధవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడనే కారణంతో జింకల రామాంజనేయులపై అక్రమ కేసు పెట్టారు. ఇటీవల ఆయన జైలు శిక్ష కూడా అనుభవించాడు. ఈ సందర్భంగా రామాంజనేయులకు జగనన్న ధైర్యం చెప్పారు. 'ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం. మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారితో సెల్యూట్ కొట్టిస్తాం' అని జగనన్న భరోసా ఇచ్చినట్లు రామాంజనేయులు తెలిపారు.

గడ్డివాముల దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాప్తాడు: మండల కేంద్రంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదానికి ఇద్దరు రైతులకు చెందిన వేరుశనగ పొట్టు, వరి గడ్డి, జొన్న సప్ప కాలిపోయింది. వివరాలు.. రాప్తాడుకు చెందిన దండు శివయ్య, దండు మల్లికార్జున అనే ఇద్దరు (అన్నదమ్ములు) రైతులు గ్రామంలో కాలువ మడి సమీపంలో కల్లం దొడ్డిలో గడ్డివాములు వేసుకున్నారు. దండు శివయ్య రూ.1.50 లక్షలు విలువ చేసే 3 ట్రాక్టర్లు వేరుశనగ పొట్టు, 2 ట్రాక్టర్లు వరి గడ్డి, దండు మల్లికార్జున రూ.1.50 లక్షలు విలువ చేసే 3 ట్రాక్టర్లు వేరుశనగ పొట్టు, 2 ట్రాక్టర్లు జొన్న సప్పను కల్లం దొడ్డిలో పక్క పక్కనే రెండు వాములు వేసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు కల్లం దొడ్డికి 200 మీటర్ల దూరంలో నిప్పు పెట్టడంతో మంటలు గడ్డివాములకు వ్యాపించాయి. బాధిత రైతులు కల్లం దొడ్డి వద్దకు చేరుకుని ఫైర్ స్టేషన్‌కు సమచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చే లోపు గడ్డి వాములు మొత్తం కాలిపోయాయి. బాధితులకు రూ.3 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త పొలానికి నిప్పు

రాప్తాడు: మండలంలోని పుల్లలరేవు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెద్ద ఓబులేష్ పొలానికి నిప్పు పెట్టడంతో 6 అల్ల నేరుడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు.. పెద్ద ఓబులేష్‌కు పుల్లలరేవు గ్రామంలో పొలం సర్వే నంబర్ 88-3 (న్యూ)లో 2-86 ఎకరాల పొలం ఉంది. ఆ పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆ పొలంలో రెండేళ్ల క్రితం 200 అల్ల నేరేడు మొక్కలు నాటాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెద్ద ఓబులేష్‌కు చెందిన 6 మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. ఈ ఏడాది జనవరి 17న 15 చెట్లు, జనవరి 21న 40 చెట్లను టీడీపీ నాయకులు నరికి వేశారు. మళ్లీ ఈనెల 3వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఓబులేష్ తోటకు నిప్పు పెట్టడంతో 6 చెట్లు కాలిపోయాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పెద్ద ఓబులేష్, స్థానికులు వెంటనే పొలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.


కాలిపోయిన అల్ల నేరేడు చెట్లు

'ప్రజా పోరాటాలను బలపర్చాలి'

అనంతపురం అర్బన్: ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వ పరిరక్షణకు సీపీఎం చేస్తున్న ప్రజా పోరాటాలను అన్ని వర్గాల వారు బలపర్చాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల్లో చేసిన తీర్మానాల సాధన దిశగా జిల్లా కమిటీ ఉద్యమిస్తుందన్నారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామిరెడ్డి, కృష్ణమూర్తితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నెల్లూరు నగరంలో తమ పార్టీ 27వ రాష్ట్ర మహాసభలు జరిగాయన్నారు. ఈ సభల్లో 49 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నిక చేశారన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా వి.రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా తనతో పాటు వి.సావిత్రిని ఎన్నుకున్నారని తెలిపారు. వివిధ ప్రజా సమస్యలపై 39 తీర్మానాలను మహాసభ ఆమోదించిందన్నారు. వాటి అమలుకు రాబోవు మూడేళ్లలో ప్రజా అజెండాతో రాజకీయ పోరాటం, మతసామరస్యం, దేశ సమైక్యత కాపాడాలన్నారు. ప్రజల ఆదాయం పెంచి, భారాలు తగ్గించాలని సూచించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, తదితర వాటిపై సీపీఎం చేపట్టే ప్రజాపోరాటాలను అన్ని వర్గాల ప్రజలు బలపర్చాలని కోరారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

నులిపురుగుల నివారణ మందులు వేయించాలి

రాప్తాడురూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈనెల 10న అనంతపురం రూరల్ మండల పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు తప్పకుండా వేయించాలని ఎంపీడీఓ దివాకర్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రూరల్ మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 50,949 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ నులిపురుగుల నివారణకు మాత్రలు వేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటస్వామి, వైద్యులు మనోజ్, గణేష్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువు ఈనెల 7వ తేదీతో ముగియనుంది. రూరల్ మండల పరిధిలోని అర్హులైన బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దివాకర్ సూచించారు. గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, వైద్యులు

వేసవిలో నీటి సమస్య తలెత్తనీయెద్దు

ఆత్మకూరు: వేసవి కాలం సమీపిస్తుండటంతో గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని ఎంపీపీ సుబ్బర హేమలత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఆర్‌డబ్ల్యూ ఏఈ శివకుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ నీటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నీరు లేని గ్రామాల్లో కొత్త బోర్లు వేయించడం, అవసరమైన చోట చేతి పంపుల్లో మోటార్లు బిగించడం జరుగుతుందన్నారు. కొన్ని చోట్ల పైప్‌లైన్ లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని గుర్తు చేశారు. లీకేజీ సమస్యలను వెంటనే పరిష్కరిద్దామన్నారు. అంతేకాకుండా కొన్ని చోట్ల మినీ ట్యాంకులకు నీరు వెళ్లడం లేదని.. అన్ని మినీ ట్యాంకులకు నీరు అందేలా చేసి వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఎక్కువగా నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్బర హేమలత

ముత్యాలమ్మ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయ హుండీ కానుకలకు బుధవారం లెక్కించారు. రూ.3,80,817 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ ఆలయంలో మొత్తం మూడు హుండీలు ఉండగా.. ఇటీవల ఒక హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏఓ నరసింహరాజు, బ్యాంక్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

అడ్డదారిలో పోస్టింగ్

- నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఐ పోస్టులు
- నగరపాలక సంస్థలో మరో అడ్డగోలు బాగోతం
- ఒక్కో పోస్టుకు రూ.5 లక్షల చొప్పున తీసుకున్నట్లు చర్చ!
- తెరవెనుక ఓ రెవెన్యూ కీలక అధికారి హస్తం!


అనంతపురం నగరపాలక సంస్థ

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థలో అడ్డగోలు వ్యవహారాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు చేయి తడిపితే చాలు పోస్టింగ్ ఎక్కడైనా.. నిబంధనలకు విరుద్ధమైన క్షణాల్లో ఇచ్చేలా ఆదేశాలు వస్తున్నాయి. అందులో భాగంగానే ఇటీవల నగరపాలక సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా వివిధ విభాగాల్లో పోస్టింగ్‌లు జరిగాయి. ప్రస్తుతం రెవెన్యూ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా రెండు ఆర్‌ఐ పోస్టులు వేస్తున్నట్లు సమాచారం. సాక్షాత్తూ నగరపాలక సంస్థకు చెందిన ఓ రెవెన్యూ అధికారి (ఓ ఉన్నతాధికారి) ఫైల్ సిద్ధం చేసినట్లు తెలిసింది.

పోస్టుకు రూ.5 లక్షలు పైమాటే

నగరంలో మొత్తం 50 డివిజన్లు ఉండగా, వాటి పరిధిలో 74 సచివాలయాలున్నాయి. మొత్తం హౌస్ హోల్డ్స్ 77,000 వరకు ఉన్నాయి. అందులో 28 రెవెన్యూ వార్డుల్లో 60 వేల అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఈ అసెస్‌మెంట్లకు ఏటా పలుమార్లు ఇంటి, నీటి పన్నులు వసూళ్లు చేయాల్సి ఉంది. అందుకు సంబంధించి నగరపాలక సంస్థలోని రెవెన్యూ విభాగం ఉంది. వాస్తవంగా రెవెన్యూ విభాగానికి ఇద్దరు రెవెన్యూ అధికారులతో పాటు నలుగురు అప్పర్ డివిజన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు' (యూడీఆర్‌ఐ) ఉంటారు. నగరపాలక సంస్థ చరిత్రలో ఇదే పద్ధతి గత కొన్ని ఏళ్లుగా నడుస్తోంది. రెవెన్యూ విభాగానికి మంజూరైన పోస్టులు ఇవి. కాగా ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధి సిఫార్సుతో మరో ఇద్దరు యూడీఆర్‌ఐలను ఎంపిక చేసేందుకు అధికారులు అడ్డదార్లో వెళ్తున్నారు. అసెస్‌మెంట్లను కారణంగా చూపి పలువురు సీనియర్ అసిస్టెంట్లకు అడ్డదారిలో పోస్టింగ్ ఇస్తున్నారు. నగరపాలక సంస్థలో గతంలో విమర్శలు కొని తెచ్చుకున్న ఇద్దరికి అవకాశం కల్పిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పోస్టుకు ఏకంగా రూ.5 లక్షల వరకు తీసుకున్నట్లు నగరపాలక సంస్థలో జోరుగా చర్చ జరుగుతోంది. ఓ రెవెన్యూ అధికారే ఈ అడ్డగోలు బాగోతానికి అండగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

నిబంధనల మేరకు ముందుకెళ్తాం

రెవెన్యూ అధికారుల పోస్టుల కేటాయింపు విషయం తెలియదు. కానీ నగరపాలక సంస్థలో ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు నిబంధనల మేరకు ముందుకెళ్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి చర్యలు తీసుకోం.

– మల్లికార్జున రెడ్డి, ఇన్‌చార్జ్ కమిషనర్, నగరపాలక సంస్థ

బడ్జెట్‌ను అందరూ వ్యతిరేకించాలి

అనంతపురం అర్బన్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. బడ్జెట్‌ను నిరసిస్తూ ఆ సంఘాలు బుధవారం వేర్వేరుగా నిరసన చేపట్టారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. జడ్జి కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ నాయకులు బడ్జెట్ ప్రతులను కాల్చివేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్ర కుమార్ మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదన్నారు. అదేవిధంగా రైతుల శ్రేయస్సు లక్ష్యంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు వీలుగా బడ్జెట్ ఉందన్నారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ తిరస్కరించాలన్నారు. ఇలాంటి బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నాయకులు కృష్ణుడు, చిరంజీవి, రాజు, వేణుగోపాల్, వెంకటేష్, సీఐటీయూ నాయకులు కృష్ణమూర్తి, వెంకటనారాయణ, ముత్యాజా, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

కంచెలు ఏర్పాటు చేస్తాం

రాప్తాడు: మండలంలో పలుచోట్ల చిన్న పిల్లలకు సైతం అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో 'నిర్లక్ష్యం.. తీస్తుంది ప్రాణం' అనే శీర్షికన జనవరి 19న సాక్షిలో కథనం ప్రచురితమైంది. ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్ నాయుడు స్పందించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీసీ బాలుర వసతి గృహం ముందు గోడ ఎత్తును పెంచి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. అలాగే ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్ల కంపలు తొలగించారు. అలాగే మండలంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


బీసీ బాలుర వసతి గృహం ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

సకాలంలో వైద్య సేవలు అందించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

అనంతపురం టౌన్: గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. బుధవారం డ్వామా కార్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఐటీసీ, ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా 5 మండలాల కార్యకర్తలకు సూక్ష్మ పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, ఎదిగే పిల్లలు సూక్ష్మ పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అయోడిన్ ఉప్పు వాడటం వాడితే తెలివైన పిల్లలు జన్మిస్తారన్నారు. అంగవైకల్యం రాకుండా ఉండాలంటే అయోడిన్ ఉప్పు, సూక్ష్మ పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రిసోర్స్‌పర్సన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఫుడ్ పిరమిడ్‌ను అందరూ పాటిస్తే అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. స్థూల, సూక్ష్మ పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ అయిషాబీ, డ్వామా రిసోర్స్ పర్సన్ మల్లీశ్వరి, మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఐజీడీ సిబ్బంది సుదర్శన్ రెడ్డి, మహమ్మద్, పోతులయ్య, రోహిన, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.